క్లుప్తంగా

రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని శివపురానికి చెందిన కొమాకుల లక్ష్మణ్ విద్యుదాఘాతంతో ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్ సిరసపల్లి నాని, పార్టీ నాయకులు దేవత అరుణ, చిన్నీలు, సుర్ల నాయుడు పాల్గొన్నారు.

రావికమతం ఏవోగా రూప


ఏవో రూప

రావికమతం: మండల వ్యవసాయాధికారిగా డి.రూప మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన రమేష్‌బాబుకు విశాఖ బీసీ లేబ్‌కు బదిలీ కావడంతో ఆ స్థానంలో యలమంచిలి వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న రూప ఇక్కడికి వచ్చి చేరారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తం


సంతతోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: వరి పంటలో తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో వై. కాంతమ్మ సూచించారు. స్థానిక సంతతోటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర సందర్శనలో భాగంగా స్థానిక వరి పొలాలను పరిశీలించారు. తెగుళ్లు సోకిన వరి దుబ్బులను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం వరిలో పాచి తెగులు(పాము పొడ తెగులు), ఆకు ముడత(తెల్ల చిత్త) తెగుళ్లు సోకాయని, వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్‌కుమార్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు కె. సత్యారావు, భాగ్య పాల్గొన్నారు.

వరి పంటకు తెగుళ్లు


వరిపంటను పరిశీలిస్తున్న ఏవో రూప

రావికమతం: వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండుతున్న వరి పొలాల్లో కొన్ని రకాల తెగుళ్లు వ్యాపిస్తున్నాయని, వాటి నివారణకుగానూ రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రూప మంగళవారం తెలిపారు. రావికమతం, సమీప గ్రామాల్లో ఆమె కొన్ని పొలాలను పరిశీలించారు. నీటి ఎద్దడి ఉన్నచోట మల్టీ కె ఒక కేజీ ఎకరానికి వేయాలని, లేని పక్షంలో రెండు శాతం యూరియా, రెండు శాతం పొటాష్ కలిపి పంట పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత నివారణకు కార్బప్ హైడ్రో క్లోరైడ్ రెండు గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. పాము పొడ తెగులు ఉన్నట్లయితే టెబుకోనజోల్ 18.3, అజాక్సి స్ట్రోబిన్ 11% మందును లీటరు నీటిలో కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు.

బడిలో చేర్పించండి


వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఎంఈవో

నాతవరం: బడి మధ్యలో మానేసిన విద్యార్థుల ఫీజు కట్టించి పాఠశాలలో చేర్పించే బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లదేనని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ మండలంలో 5 నుంచి 18 ఏళ్ల లోపు వారు 99 మంది బడిబయట ఉండకూడదన్నారు. వారికి ఆసక్తి ఉన్న కాలేజీ లేదా ఓపెన్ స్కూల్, ఐటీఐ తదితర వాటిలో చేర్పించాలన్నారు. మండల వ్యాప్తంగా 442 మందిని ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు.

5 రోడ్ల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు


హాజరైన కన్వీనర్లు


బూత్ కమిటీ కన్వీనర్లతో మాట్లాడుతున్న నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

- సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలి
- నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

గొలుగొండ: నర్సీపట్నం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం రూ.10.04 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఆయన జోగుంపేటలో మాట్లాడుతూ ప్రధానంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నట్టు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ మేరకు ఐదు రోడ్లకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. నాతవరం మండలం సుందరకోట నుంచి అననగిరి గ్రామానికి 3.2 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు, మాకవరపాలెం మండలం గుడితూరు నుంచి సుంకపూరు గ్రామానికి 2.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు, గొలుగొండ మండలం కరక ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి డొంకాడ రోడ్డు నిర్మాణానికి రూ.1.35 కోట్లు, పీఎన్‌డీ పాలెం నుంచి పప్పుశెట్టిపాలెం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.4.60 కోట్లు, ఎస్. గదబపాలెం నుంచి నిమ్మగెడ్డ మిగులు రోడ్డు కోసం రూ.60 లక్షల చొప్పున కేటాయించామన్నారు. ఈ నిధులతో నెల రోజుల్లో పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ప్రధాన రోడ్ల సమస్య పరిష్కారం కోసం కృషి చేసినట్లు చెప్పారు.

బూత్ కమిటీ కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలి

మండలంలో 50 బూత్‌ల పరిధిలో ఎంపిక చేసిక కన్వీనర్లు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే గణేష్ కోరారు. మంగళవారం కృష్ణదేవిపేట, చీడిగుమ్మల, జోగుంపేట ప్రాంతాల్లో బూత్ కమిటీ కన్వీనర్లతో ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు జరుగుతున్నట్లు తెలిపారు.

9 నుంచి 'ఏపీకి జగన్ ఎందుకు కావాలి'

ఈ నెల 9వ తేదీ నుంచి మండలంలో చీడిగుమ్మల నుంచి ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు హామీలు, 2019 ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. సీఎంగా పనిచేసిన చంద్రబాబు ప్రజలను మోసం చేస్తే, ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నూరుశాతం అమలు చేశారన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. ఈ నెల మూడో వారంలో సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం కోసం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపీపీ సుర్ల బాజ్జి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి స్పందన


ఖండిపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు


రావికమతం: జెడ్.కొత్తపట్నంలో రోగిని పరీక్షిస్తున్న డెర్మటాలజిస్టు సువర్ణ

రావికమతం: జెడ్.కొత్తపట్నంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం విజయవంతమైంది. 532 మంది వివిధ సమస్యలతో ఈ శిబిరానికి హాజరయ్యారు. వీరందరికీ బీపీ, సుగర్ చెక్ చేసి కౌంటర్ల వారీగా వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. డెర్మటాలజిస్టు సువర్ణ, ఆప్తాలమిస్టు బిందు, వైద్యాధికారులు సురేఖ, శ్రీనివాస్ హాజరై రోగులకు సేవలందించారు. అవసరమైన వారికి ఇంజక్షన్లు, సరిపడగా మందులు అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు అధిక పోషక విలువలు ఆహారోత్పత్తులను తయారు చేసి ప్రదర్శించారు. ఏయే పోషకాహారం వల్ల ఎన్ని కేలరీల శక్తి వస్తుందో పలువురికి వివరించారు.

చోడవరం: జగనన్న ఆరోగ్య రక్ష శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. సర్పంచ్ శానాపతి రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఖండిపల్లిలో నిర్వహించిన ఈ శిబిరంలో 603 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారి దమయంతి పర్యవేక్షణలో వైద్యుల బృందం పరీక్షించి మందులు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శానాపతి సత్యారావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల వైద్యం కోసం అన్ని విధాలుగా చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులు ఆధునికీకరించడంతోపాటు 108, 104 అంబులెన్సుల సేవలు మరింత విస్తృతం చేసిందన్నారు. ఆధునిక, మెరుగైన వైద్యాన్ని పేదలందరికీ అందించడానికి సీఎం అన్ని విధాలుగా కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం నిర్వహించని విధంగా ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా ఇంటికే వైద్యాన్ని తెచ్చి అందిస్తున్నారన్నారు. ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఈవోపీఆర్డీ చైతన్య, తహసీల్దార్ తిరుమలబాబు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు పాల్గొన్నారు.

భయపెట్టి సభలకు తరలించే సంస్కృతి కాదు


మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్ తదితరులు

- నియోజకవర్గంలో ఎన్ని గ్రామాలున్నాయో తెలుసా?
- పైలాకు ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్ సూటిప్రశ్న

మాడుగుల: ప్రజలను భయపెట్టి సభలు, సమావేశాలకు తరలించే సంస్కృతి వైఎస్సార్‌సీపీకి లేదని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రజలను భయపెట్టి బస్సు యాత్రకు తరలించడానికి ప్రయత్నిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ నాయకుడు పైలా ప్రసాదరావు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. మోసపూరిత వాగ్దానాలు చేసి అమలు చేయకుండా చంద్రబాబు డ్వాక్రా అక్కచెల్లెమ్మలను మోసం చేశారన్నారు. డ్వాక్రా రుణమాఫీ చేసి వారిని ఆదుకున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పార్టీలకతీతంగా పైసా లంచం లేకుండా 99 శాతం అమలు చేసిన నాయకుడు సీఎం జగన్ ఒక్కరేనన్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి నేరుగా ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుంటే తప్పుడు సమాచారం ఇవ్వడం సమంజసం కాదన్నారు. సంక్షేమ పథకాలు క్యాలెండర్ ప్రకారం కొనసాగాలంటే మరలా సీఎంగా జగన్ ఉండాలని ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తుంటే, అది చూసి ఓర్వలేక పైలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అది మానుకోకపోతే రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. నియోజకవర్గంలో మారుమూల గిరిజన ప్రాంతాలు సైతం సీఎం సహకారంతో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు 80 శాతం మేర రోడ్లు మార్పు చేస్తుంటే విమర్శలు చేయడం తగదన్నారు. గతంలో నియోజకవర్గంలో గిరి గ్రామాలకు బైక్‌లు వెళ్లలేని పరిస్థితులు ఉండేవన్నారు. ఇప్పుడు కార్లపై ప్రయాణిస్తున్నారని, ఇంతటి అభివృద్ధి కనపడలేదా అని ప్రశ్నించారు. గతంలో మాడుగుల మండలం కేజేపురం నుంచి అప్పలరాజు పురం మీదుగా చీడికాడ వెళ్లాలంటే నరక యాతన ఉండేదని, దేవరాపల్లి, కె. కోటపాడు మండలాలకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి ఉండేదన్నారు. తప్పుడు ప్రచారాలు, మోసపూరిత వాగ్దానాలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కంప్యూటర్‌పై గ్రాఫిక్స్ చూసుకునే తనకు నియోజకవర్గంలో గ్రామాల పరిస్థితులు, అభివృద్ధి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి చేస్తున్నా లేనట్లుగా కళ్లులేని కబోదుల్లా మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనువాస్, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాస్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు, జేడీపేట సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, ఎంపీటీసీ తలారి అప్పారావు, నాయకులు శ్రీనాథు జగ్గారావు, పాము వెంకటరావు, కోట్ని శ్రీరాంమూర్తి, రాఖీ శ్రీను పాల్గొన్నారు.

సర్దార్ పటేల్ సేవలు ఆదర్శనీయం



కవాత్తుల ర్యాలీలో అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా


పటేల్ చిత్రపటానికి చిన్నారులతో కలిసి పూలమాల వేసిన పద్మావతి

నర్సీపట్నం: జాతీయ సమైక్యతా ర్యాలీని పట్టణంలో పోలీసులు మంగళవారం నిర్వహించారు. ఈ ర్యాలీలో అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా పాల్గొన్నారు. స్థానిక శ్రీకన్య కూడలి నుంచి అబిద్ సెంటర్ వరకు కవాత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహిస్తున్నామన్నారు. గొప్ప పరిపాలనాదక్షుడు, వజ్రసంకల్పుడు, దార్శనికుడైన సర్దార్ పటేల్ భారత గడ్డపై పుట్టిన అరుదైన నాయకుల్లో ఒకరని కొనియాడారు. ఆయన చూపిన ఉన్నత ఆదర్శాలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. రూరల్ సీఐ రమణయ్య, ఎస్సై సుధాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పటేల్ దృఢ సంకల్పంతో..

చోడవరం రూరల్: ప్రతి విద్యార్థి సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రను చదవాలని, ఆయనలోని స్ఫూర్తిదాయక అంశాలను ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల మూడు ఎన్.ఎస్.ఎస్. యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో జరిపిన వేడుకల్లో భాగంగా సర్దార్ పటేల్ చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపన్యాసకుడు జి.సత్యనారాయణ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యానంతరం దేశంలో 185కు పైగా సంస్థానాలను దేశంలో విలీనం చేయడంలో సర్దార్ చూపిన దృఢ సంకల్పమే కారణమన్నారు. అందుకే ఆయన్ను దేశ ప్రజలు ఉక్కుమనిషిగా కీర్తించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దేశం సమైక్యంగా ఉంటేనే ఇతర దేశాలు గౌరవంతో ఉంటాయని పటేల్ విశ్వసించారన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓలు వి.రత్నభారతి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి విద్యార్థులతో సమైక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: జాతీయ సమైక్యత పట్ల సర్దార్ వల్లభాయ్ పటేల్ నిబద్ధత మనందరికి మార్గదర్శకమని గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి అన్నారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

తూటిపాలలో ఏక్తా దివస్

మాకవరపాలెం: దేశ మొదటి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఏక్తా దివస్‌లో భాగంగా మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారంతా మానవహారంగా ఏర్పడి పటేల్ మాస్కులతో ప్రతిజ్ఞతోపాటు ఐక్యత కోసం పరుగును నిర్వహించారు. హెచ్ఎం కోసూరు రాము, ఉపాధ్యాయులు లోవరాజు, నారాయణరావు పాల్గొన్నారు.


సర్దార్ పటేల్‌కు ఘన నివాళులర్పిస్తున్న దృశ్యం


విద్యార్థులతో సమైక్యతా ప్రతిజ్ఞ


తూటిపాలలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు


ప్రకృతి విధానంలో సాగైన అన్ని రకాల పంట


చింతలూరులో అవగాహన కల్పిస్తున్న సేంద్రియ వ్యవసాయ డీఎల్ఎంపీ స్వామినాయుడు

మాడుగుల రూరల్: మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి, ఆరోగ్యకరమైన పంటలు పండించాలని అనకాపల్లి జిల్లా ప్రకృతి వ్యవసాయం డీఎల్ఎంపీ ఆర్.వి.స్వామినాయుడు తెలిపారు. మంగళవారం చింతలూరులో గ్రామ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి ప్రతి రైతు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయంలో సార్వత్రిక సూత్రాలు, ఇంటింటా పెరటితోటలు, రాజీలేని సూత్రాలు, ఎన్‌పీఎం షాపులు, ఏటీఎం మెడల్స్, ఏ గ్రేడ్ మెడల్స్ గురించి వివరించారు. మహిళా రైతులు భూమిని సారవంతం చేసుకోవాలన్నారు. పొలం గట్ల మీద అదనపు ఆదాయాన్నిచ్చే మొక్కలను క్షేత్రస్థాయిలో సంబంధిత ఐసీఆర్పీ కాళింగ దేవి పరిశీలించారు. అరటి, మునగ, బొప్పాయి, జామ, నిమ్మ, బీర, బెండ, చిక్కుడు, వంగ, బరబాటి, బంతి, వంటి మొక్కలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి గండి శ్రీనివాసరావు, యూనిట్ ఇన్‌చార్జి సన్యాసిరావు, ఆదర్శ రైతు కోమాలా శ్రీను, కాళింగ శ్రీరామూర్తి పాల్గొన్నారు.

సత్ఫలితాలనిస్తున్న ప్రకృతి సాగు

మాకవరపాలెం: ప్రకృతి సేద్య విధానంలో చేపట్టిన నిరంతరం ఆదాయాన్నిచ్చే సాగు సత్ఫలితాలనిస్తోంది. మండలంలోని నారాయణరాజుపేట, జంగాలపల్లి, మల్లవరం, నగరం, జి.వెంకటాపురం గ్రామాల్లో రైతులకు ఉన్న 20 సెంట్లలో నిత్యం ఆదాయం సమకూర్చే దుంప, తీగజాతి, ఆకు కూరలు, కూరగాయలు, తదితర పంటలను ప్రకృతి సేద్య పద్ధతిలో సాగు చేశారు. ప్రకృతి సిబ్బంది ఈ విధానంపై అవగాహన కల్పించి రైతులతో రెండు నెలల క్రితం విత్తనాలు వేయించారు. ప్రధానంగా నెలకు రూ.15 నుంచి రూ.20 వేల ఆదాయం పొందడమే లక్ష్యంగా అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో రైతులకు ఈ సాగు సత్ఫలితాలనిస్తోంది. జి.వెంకటాపురంలో వేసిన అన్ని రకాల పంట ఏపుగా పెరిగి ఆదాయాన్నిచ్చేందుకు సిద్ధంగా ఉంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్డీవో దృష్టికి ఈనాం భూ సమస్య


ఆర్డీవో జయరాంతో సమావేశమైన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: గొలుగొండ మండలం యల్లవరం ఈనాం భూ సమస్యపై ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం ఆర్డీవో హెచ్.వి.జయరాంతో సమావేశమయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఈనాం భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. 1200 ఎకరాల్లో 300 మంది రైతులు కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారని, రైతులకు న్యాయం చేయాలన్నారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, తహసీల్దార్ ఆనందరావు పాల్గొన్నారు.

జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

రోలుగుంట: స్థానిక వెలుగు శాఖ ఆధ్వర్యంలో 30 మంది గ్రామస్థాయి సామాజిక కార్యకర్తలకు ఏపీఎం సాధన సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల మహిళలు తమ జీవనోపాధులు మెరుగు పరుచుకోవాలన్నారు. పాడి పశువులు, కూరగాయలు, కిరాణా తదితర ఉపాధిపై ప్రణాళిక తయారు చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. తర్వాత గ్రూపులుగా విభజించి పరీక్ష నిర్వహించి వారి ఆలోచన సామర్థ్యం తెలుసుకున్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేద్దాం

మాడుగుల ఘాట్‌రోడ్డులో జోరుగా ఏర్పాట్లు


సభా ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న కూలీలు


ఖండివరంలో బస్సు యాత్ర గురించి సమీక్షిస్తున్న పార్టీ నేత సుంకర శ్రీనివాసరావు

మాడుగుల: ఘాట్‌రోడ్ జంక్షన్‌లో గురువారం జరగనున్న నియోజకవర్గ స్థాయిలో సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి పర్యవేక్షణలో ఈ పనులు నిర్వహిస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ నలుమూలల నుంచి తరలి వచ్చే వేలాది వాహనాలకు పార్కింగ్ ఇప్పటికే సిద్ధం చేశారు. సభా ప్రాంగణంలో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ యాత్ర విజయవంతం చేయాలని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ కోరారు. పట్టణాధ్యక్షుడు బొమ్మి శెట్టి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనాథు జగ్గారావు, యన్నంశెట్టి వెంకటరావు మిత్తిపాటి అశోక్, కోట్ని శ్రీరాంమూర్తి, కరణం రాము పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో గురువారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుంకర శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఖండివరంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. బస్సు యాత్ర విజయవంతానికి సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలి రావాలని, వారిని ఈ సభకు తరలించేటట్లు కృషి చేయాలని కోరారు. డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, మండల కోప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, చీడికాడ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మోసూరి సన్నిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గెంజి స్వాతి, బాలాజీ, గ్రామ శాఖ అధ్యక్షులు సుంకర కొండబాబు పాల్గొన్నారు.

జి. కొత్తపల్లిలో.....

బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కొల్లి శ్రీనివాసరావు కోరారు. జి. కొత్తపల్లి గ్రామ సచివాలయ పరిధిలో 500 మందికి తక్కువ కాకుండా బస్సు యాత్రకు తరలించాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. నాయకులు పుట్టా రామ్‌కుమార్, మహలక్ష్మినాయుడు, వెంకట్రావు పాల్గొన్నారు.

కింతలిలో..

కింతలిలో పొంగలిపాక ఎంపీటీసీ సభ్యుడు మైచర్ల సన్యాసిరావు మాట్లాడుతూ ఈ బస్సు యాత్రకు గ్రామం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని కోరారు. గ్రామ శాఖ అధ్యక్షుడు జామి చిన్న, సర్పంచ్ భవానీ, వెలుగు వీవోఏ సుంకర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు వెండి కంఠాభరణం బహూకరణ


మోదకొండమ్మకు వెండి కంఠాభరణం అలంకరిస్తున్న హరినాథ్ దంపతులు

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదకొండమ్మకు అర కిలో వెండి కంఠాభరణం అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తులు దాడి వీరునాయుడు కుమారుడు హరినాథ్, మాధవి దంపతులు మంగళవారం మేళతాళాలతో ఊరేగింపుగా ఇక్కడ ఆలయానికి చేరుకుని ఆభరణాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మద్దాల రమణ, బొడ్డేడ సురేష్, కాళ్ల అప్పలనాయుడు, కాళ్ల అమ్మతల్లినాయుడు, యల్లపు రాము, తదితర భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

తిరుపతిలో రోలుగుంట యాత్రికుడు అదృశ్యం


రామారావు

రోలుగుంట: అర్ల గిరిజన పంచాయతీకి చెందిన బాణం రామారావు(48) తిరుపతి దర్శనానికి వెళ్లి అదృశ్యమయ్యాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బాణం రాజారావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 27న బి.బి. పట్నం, రత్నంపేట, అర్ల గ్రామాల నుంచి భవానీ భక్తులు, సాధారణ భక్తులు కలిసి 40 మంది ప్రైవేటు బస్సులో యాత్రకు బయలుదేరి వెళ్లారు. సోమవారం తిరుపతి చేరుకుని అందరూ దర్శనానికి వెళ్లారు. అదే గ్రామం నుంచి వెళ్లిన పది మందిలో రామారావు లేకపోవడంతో అక్కడ విచారణ కేంద్రంలో మైక్ ఎనౌన్స్ చేయించినా ఫలితం లేదు. దీంతో అతని భార్య రాజులమ్మ, సర్పంచ్ వండల వనితకు ఫోన్లో సమాచారం ఇచ్చారు. 9705134230 నంబర్‌కు ఆచూకీ తెలియజేయాలని, తగిన పారితోషికం ఇస్తామన్నారు.

పిండ్రంగిలో రూ.30 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం


బీసీ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

కె.కోటపాడు: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంజూరు చేసిన రూ.30 లక్షలతో పిండ్రంగిలోని పలు వీధుల్లో సీసీరోడ్లు నిర్మిస్తున్నారు. ఉపాధి నిధులు రూ.25 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.5 లక్షలు కలిపి గ్రామంలో 500 మీటర్ల మేర సీసీరోడ్లు నిర్మిస్తున్నామని సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి తెలిపారు. బీసీ కాలనీలో సిమెంట్ రోడ్ల పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలను పాటించి పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొరువాడ ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు పాల్గొన్నారు.